

చీఫ్ ఎడిటర్: దొండ్లవారు భవ్య (జర్నలిస్ట్)

గ్లోబల్ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

RNI.No:-APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

"అతికొద్ది కాలంలోనే అత్యధిక ప్రజాదరణ పొందిన"
"గ్లోబల్ వార్త" జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గాల్లో
రాయచోటి,
రాజంపేట, రైల్వేకోడూరు,
మదనపల్లి, పీలేరు,
తంబళ్ళపల్లి, పుంగనూరు
విలేకరులు కావలెను
వివరాలకు కింద ఉన్న ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.
ఫోన్ నెంబర్స్ - 7093627232, 9392480345, 08562-461571
MAIL ID : globalvarthaindia@gmail.com

సంపుటి 1 | సంచిక 65 | 06 -11-2026 | శుక్రవారం | పేజీలు -4 | వెల-రూ. 5

ఢిల్లీలో కుప్పకూలిన మూడంతస్తుల భవనం

శిథిలాల కింద పలువురు!



గ్లోబల్ వార్త – న్యూఢిల్లీ దేశ రాజధాని ఢిల్లీలో గురువారం ఉదయం భారీ ప్రమాదం చోటుచేసుకుంది. పాత ఢిల్లీలోని చాందీ బజార్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. చాందీ బజార్ మెట్రో స్టేషన్ సమీపంలోని గలీ సితారా వద్ద ఉదయం ఈ ఘటన జరిగినట్లు సమాచారం. భవనం కూలిపోవడంతో భారీగా శిథిలాలు రోడ్డుపై పడిపోయాయి. ఈ ప్రమాద సమయంలో పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఒక్కసారిగా భవనం కూలి పోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సహాయక చర్యల కోసం నీటి ట్యాంకర్లు, రెస్క్యూ వాహనాలతో పాటు కనీసం ఆరు అగ్ని మాపక బృందాలను అక్కడికి పంపించినట్లు అధికారులు వెల్లడించారు. శిథిలాలను తొలగిస్తూ లోపల ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చేపడుతున్నారు. మరోవైపు సీనియర్ అధికారులు స్వయంగా ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. భవనం కూలిపోవడానికి గల కారణాలు, ప్రమాద సమయంలో భవనంలో ఎంత మంది ఉన్నారు, ఎంతమంది గాయపడ్డారు అనే వివరాలు తెలియాల్సి ఉంది.

ఎపిఇఆర్సి చైర్ పర్సన్‌గా బినోయ్ కుమార్ ప్రమాణ స్వీకారం

గ్లోబల్ వార్త – అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ (ఎపిఇఆర్సి)చైర్ పర్సన్ గా బినోయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 3వతేదీన జిఓఎంఎస్ సంఖ్య 87 ద్వారా ఎపిఇఆర్సి చైర్ పర్సన్ గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బినోయ్ కుమార్ (దీఅఅశీఎ ఖబఖ్ఘతీ)ను నియమించడంతో గురువారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ బినోయ్ కుమార్‌తో చైర్ పర్సన్‌గా ప్రమాణం చేయించారు.ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఐదేళ్ళ కాలం లేదా 70 సంవత్స రాలు వయస్సు నిండే వరకూ ఏది ముందైతే అది ఆప్రకారం పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఆఉత్తర్వుల్లో పేర్కొంది. ఎపి ఇఆర్సి చైర్ పర్సన్ గా ప్రమాణం చేసిన బినోయ్ కుమార్ కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.అదే విధంగా ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సియం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సహా ఇతర అధికారులు బినోయ్ కుమార్ కు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో జెన్కోఎండి నాగలక్ష్మి,సిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి,జెఎండి ట్రాన్స్కో సూర్య సాయి ప్రవీణ్ చంద్,ఎపిఇఆర్సి సభ్యులు పివిఆర్ రెడ్డి,ఎపి నెరెడ్కాప్ విసి అండ్ ఎండి కమలాకర్ బాబు,ఎపిఇఆర్సి కార్యదర్శి పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధికి విట్ సంస్థ కోటి విరాళం

గ్లోబల్ వార్త – అమరావతి

ముఖ్యమంత్రి సహాయ నిధికి అమరావతిలోని వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూ.కోటి విరాళాన్ని అందజేసింది. ఆ సంస్థ చైర్మన్ జి.విశ్వ నాథన్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విరాళాన్ని అందజేశారు. అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో ఏపీ తీవ్రంగా నష్ట పోయిందని... తుఫాను బాధితులకు సహకారం అందించేలా వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ విరా ళాన్ని అందిస్తున్నట్లు వివరించారు. విరాళం ఇచ్చిన విట్ ప్రతినిధులను సీఎం చంద్రబాబు అభినందించారు.

యువతకు ఎయిర్‌ఫోర్స్ పిలుపు

16 నుంచి 22 ఏళ్ల యువతకు అగ్నివీర్ వాయు, ఎయిర్‌మెన్‌గా సేవలందించే అవకాశం

డిసెంబర్ 6న సంద్యాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం

యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ రాజకుమారి గణియా



గ్లోబల్ వార్త- నంద్యాల :

దేశ రక్షణలో కీలక పాత్ర పోషించే భారత వైమానిక దళంలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న యువతకు నంద్యాలలో ప్రత్యేక అవకాశం అందుబాటులోకి రానుంది. అగ్నివీర్ వాయు, ఎయిర్‌మెన్ ఉద్యోగావ కాశాలు, అర్హతలు, ఎంపిక విధానంపై అవగాహన కల్పించేందుకు డిసెంబర్ 6న జిల్లాలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భారత వైమానిక దళానికి చెందిన 12వ ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ ప్రతి నిధులు శేఖర్, నిధీష్‌లు కలెక్టర్‌ను కలిసి కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన అధికారిక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్య క్రమానికి అనువైన వేదిక కేటాయించాలని, జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసు కోవాలని ప్రతినిధులు కోరారు. కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు పోలీసు బందోబస్తు, వైద్య, అగ్ని మాపక సిబ్బందిని అందు బాటులో ఉంచేందుకు జిల్లా యంత్రాంగం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ రాజకుమారి స్పందిస్తూ.. భారత వైమానిక దళంలో చేరాల నుకునే యువతకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా 16 నుంచి 22 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవసర మైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అగ్నివీర్ వాయు, ఎయిర్‌మెన్ ఉద్యోగాలకు సంబంధించిన అవకాశాలు, అర్హత ప్రమాణాలు, ఎంపిక ప్రక్రియ అంశాలపై యువతకు స్పష్టమైన అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. దేశ రక్షణలో భాగస్వాములు కావాలనే ఆసక్తి ఉన్న యువతకు ఇది చక్కటి మార్గదర్శక కార్యక్రమంగా ఉపయోగపడుతుందని తెలిపారు. వైమానిక దళంలో సేవలందించాలనే లక్ష్యంతో ఉన్న నంద్యాల జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

వీటిని ఎన్నికలంటారా?

ప్రెస్‌మీట్‌లో వైఎస్ జగన్



గ్లోబల్ వార్త – తాడేపల్లి : దేశంలో ఇలాంటి ఎన్నికలు ఎక్కడా జరగలేదు. ఇవి ఎన్నికలు కావు. మొత్తం ఎన్నికల్ని హైజాక్ చేశారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో వైఎస్ జగన్ మాట్లాడు తున్నారు. ఇవి ఎలక్షన్‌లా? లేక సెలక్షన్‌లా? అన్ని రకాలు గా ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేశారు. దేశ చరిత్ర తో ఇలాంటి ఎన్నికలు ఎక్కడా జరగలేదు. ఎన్ని కల ప్రక్రియను మొత్తం కబ్జా చేశారు. ఎన్నికల షెడ్యూల్ రాగానే బైండోవర్ కేసుల పేరుతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్ని ఇబ్బంది పెట్టారు. మా నేతల్ని నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడం లేదు. అధికార దుర్వినియోగంతో, రౌడీయిజంతో ప్రజా స్వామ్యాన్ని అన్నీ రకాలుగా కూనీ చేశారు. పార దర్శకంగా ఎన్నికలకు వెళ్లే ధైర్యం చంద్ర బాబు కు లేదు. ప్రజా స్వామ్యాన్ని కూనీ చేసి చంద్ర బాబు మరింత దయనీయ స్థితికి దిగజారారు.

ప్రజాస్వామ్యాన్ని అన్నీ రకాలుగా ఖూనీ చేశారు

'ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగడం లేదు. అధికార దుర్వినియోగంతో, రౌడీయిజంతో ప్రజాస్వామ్యాన్ని అన్నీ రకాలుగా ఖూనీ చేశారు. పారదర్శకంగా ఎన్నికలకు వెళ్లే ధైర్యం చంద్రబాబుకు లేదు. ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేసి చంద్రబాబు మరింత దయనీయ స్థితికి దిగజారారు' అని ధ్వజమెత్తారు. స్ట్రూటినీ సమయంలో అధికారులే పత్రాలను చింపే శారు. పోలీసులు, అధికారులు మాఫియా ముఠాగా ఏర్పడ్డారు. అడ్డు కోవా ల్సిన ఎస్ఈసీ చంద్ర బాబుకు తొత్తుగా మారింది. 17 మున్సిపాలిటీల్లో నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు. మరి కొన్ని చోట్ల మా నామినేన్లను తిరస్కరించారు. 22 మున్సిపాలిటీల్లో నామినేషన్లలోనే పోటీ లేకుండా చేశా రు. కొన్ని చోట్ల మా పార్టీ నేతలను పోటీలోనే లేకుండా చేశారు. పలు బూత్‌లలో మా ఏజెట్లను కూర్చోనివ్వలేదు.పోలీసుల ఎదుట రిగ్గింగ్ చేసిన ఘటనలు కోకొల్లలు. ఇలాంటి ఎన్నికలు.. అసలు ఎన్నికలేనా? 84 జడ్పీటీసీల్లో మా నేతలను నామినేషన్లు వేయనివ్వలేదు. 2,109 ఎంపీటీసీ స్థానాల్లో కూడా నామినేషన్లు వేయ నివ్వలేదు. మా అభ్యర్థులను అడ్డగోలుగా అరెస్టు లు చేస్తున్నారు. ఏజెంట్లను బూత్‌ల్లోకి వెళ్లకుండా పోలీసులే అడ్డుకున్నారు.

ప్రతిపక్ష పార్టీని పోటీ చేయనివ్వకపోతే ఎన్నికలు ఎందుకు?

నామినేషన్లు రిగ్గింగ్.. స్ట్రూటినీ రిగ్గింగ్. పోలింగ్ బూత్‌ల రిగ్గింగ్..పోలింగ్ సైక్లింగ్ రిగ్గింగ్. పోలింగ్ పర్సంటేజ్‌లు.. బ్యాలెట్ బాక్స్‌లు సైతం రిగ్గింగ్. ఇవన్నీ దాటుకుని మా వాళ్లు గెలిస్తే.. ఆ ఫలితాను కూడా రిగ్గింగ్ చేశారు. చంద్రబాబు వీటిని గెలుపుగా చెప్పుకోవడం సిగ్గు చేటు. కూడేరులో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలీసులు నిర్బంధించారు. మురట్లోలో టీడీపీ రిగ్గింగ్ చేస్తుంటే సీఐ రాజు కాపలాకాశారు. వెలిగండ్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను లాగి పడేశారు. సుంకేశుల గ్రామంలో ఏజెంట్ల ఫామ్‌లను చింపేసి దాడి చేశారు. చంద్రగిరి సాయి నగర్‌లో టీడీపీ దొంగ ఓటర్లను వైఎస్సార్‌సీపీ నేతలు పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా పీలేరులో టీడీపీ రిగ్గింగ్ చేసింది. పులివెందుల అచ్చివెల్లిలో ఓటర్లపై పోలీసుల లాఠీఛార్జ్.వేములలో స్లిప్పులిచ్చేసి వెళ్లాలని ఓటర్లను బెదిరించారు. లింగాల మండలంలో దాడి చేసేందుకు.. టీడీపీ గూండాలు రాడ్లు, కర్రలు సిద్ధం చేసుకున్నారు'అని వైఎస్ జగన్ మీడియా ముఖంగా స్పష్టం చేశారు.

కడప, పులివెందులలో జగన్ అరాచకాలు, దౌర్జన్యాలతో ఓటర్లను భయపెడుతున్నారు: పల్లా శ్రీనివాసరావు




గ్లోబల్ వార్త – అమరావతి : రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో గొడ్డలి పార్టీ అబద్ధాలు, అరాచకాలతో ఓటర్లను మభ్యపెట్టి, భయపెట్టి గెలవాలని చూస్తోందని ధ్వజమెత్తారు. గురువారం అమరావతి వేదికగా మీడియాతో పల్లా శ్రీనివాస రావు మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలోని ఎర్రిపల్లిలో పెట్రోల్ బాంబులతో దాడులు చేసి ఓటర్లను వైసీపీ శ్రేణులు భయపెడుతున్నారని ఆగ్రహించారు.పెట్రోల్ బాంబులతో భయపెడుతున్నారు. పులివెందులలో ఓటర్లు స్వచ్ఛందంగా ఓట్లు వేసేందుకు వస్తుంటే పెట్రోల్ బాంబులతో భయపెడుతున్నారని పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, చిత్తూరులో ఓటింగ్ శాతం పెరిగిందని కానీ కడపలో ఓటింగ్ శాతం పెరగడం లేదని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎంపీ అవినాశ్‌రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు పోలింగ్ కేంద్రాలోకి వెళ్లి దౌర్జన్యాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కుప్పంలో బయటి ప్రాంతాల నుంచి రౌడీలను తీసుకువచ్చి ఓట్లు వేయిస్తున్నారని ఆరోపించారు. కడప, పులివెందులలోని పోలింగ్ కేంద్రాల్లో జగన్ రెడ్డి అరాచకాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు.

టీడీపీ కార్యకర్తలపై దాడులు..

మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన తీర్పే... జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వస్తుందని పల్లా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. దొంగ ఓటర్లను అడ్డుకుంటే పుంగనూరులో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు దాడులు చేశాయని మండిపడ్డారు. జమ్మలమడుగులో రామసుబ్బారెడ్డి కుమారుడు వెంకట శివారెడ్డి టీడీపీ ఏజెంట్లపై దౌర్జన్యంగా ప్రవర్తించారని ఫైర్ అయ్యారు. రైల్వేకోడూరులో పెట్రోల్ బాంబులతో టీడీపీ శ్రేణులపై దాడులు చేశారని ఆగ్రహించారు. పల్లాడులో టీడీపీ కార్యకర్తపై రాళ్లతో దాడులు చేశారని అన్నారు. అరాచకాలు, దౌర్జన్యాలతో ఓట్లను భయపెట్టేందుకు జగన్ రెడ్డి చూస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు కూటమి వైపు ఉన్నారనే విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలని పల్లా శ్రీనివాసరావు హితవు పలికారు.

అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో డెమొక్రాట్లు ఘన విజయం సాధించారు



డెమొక్రాట్లు, రిపబ్లికన్లు:

– సెనేట్ : 51-40

-హౌస్ : 205-110

-గవర్నర్లు 24-15

అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ పార్టీ అయిన రిపబ్లికన్స్, అక్కడి పార్లమెంట్ (దాన్ని కాంగ్రెస్ అంటారు) లో తమ మెజారిటీని కోల్పోయింది! ముందుగా అసలు మిడ్‌టర్మ్ ఎన్నికలు అంటే ఏంటో అర్థం చేసుకుందాం. సాధారణంగా అమెరికాలో ప్రెసిడెంట్ పదవీకాలం 4 సంవత్సరాలు ఉంటుంది. కానీ సరిగ్గా రెండేళ్ల తర్వాత అక్కడ 'మిడ్‌టర్మ్ ఎన్నికలు' జరుగుతాయి. ఇప్పుడు జరిగింది కూడా సరిగ్గా అవే ఎన్నికలు. ఇందులో ప్రతిపక్షమైన డెమొక్రాట్స్ పార్టీ అమెరికన్ కాంగ్రెస్‌లో పూర్తి మెజారిటీని సాధించింది!దీనివల్ల, అధికారికంగా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ కొనసాగినప్పటికీ.. ఇకపై ఆయన ఎలాంటి కొత్త నిబంధనలు, చట్టాలు తేవాలన్నా, లేదా ఏదైనా బిల్లును పాస్ చేయాలన్నా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు! అంతేకాకుండా, ప్రతిపక్ష డెమొక్రాట్ పార్టీ ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విచారణ కూడా ప్రారంభించే అవకాశం ఉంది! అమెరికాలో ఒక నిబంధన ఉంది.. ఎవరైనా సరే రెండు సార్లకు మించి అధ్యక్షుడు కాలేరు. కానీ ఒకవేళ ట్రంప్ పార్టీకి ఈ మిడ్‌టర్మ్ ఎన్నికల్లో కూడా పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే, బహుశా ట్రంప్ ఈ రూల్‌నే మార్చేసి మూడోసారి కూడా అధ్యక్షుడు కావడానికి ప్రయత్నించి ఉండేవారేమో! కానీ ఇకపై అలాంటిదేమీ జరగదు! ఎందుకంటే ఇది డొనాల్డ్ ట్రంప్‌కు కచ్చితంగా చివరి టర్మ్ కాబోతోంది. కనీసం ఇప్పటికైనా ప్రపంచంలోని ఎన్నో దేశాలకు కాస్త ప్రశాంతత దక్కుతుంది.. ఒక వింత/పిచ్చి మనిషి నుంచి దేశాలకు విముక్తి లభించినట్లే! కేవలం రెండేళ్లలోనే ఇంత దారుణమైన పతనం!

అదే మన నరేంద్ర మోదీ చూడండి..

12 ఏళ్లు గడిచినా కూడా, 2024 సార్వత్రిక ఎన్నికల సమయం నుండి గత రెండేళ్లలో చీణూ కూటమికి 11 రాష్ట్రాలు ఉ కేంద్రపాలిత ప్రాంతాలను గెలిపించారు (కేవలం 4 చోట్ల మాత్రమే ఓటమి, అందులోనూ బీజేపీ ప్రభావం తక్కువగా ఉండే తమిళనాడు, కేరళ ఉన్నాయి). ఆ 15 అసెంబ్లీలలో చీణూ ఎమ్మెల్యేల సంఖ్య 750 నుండి ఏకంగా 1,289 కి పెరిగింది (+539 నికర పెరుగుదల, 71.9% వృద్ధి)! ఈ ఓడిపోయిన 'లూజర్' ట్రంప్.. ఆ మహా లూజర్ అయిన 'ఝండ్ నాయక్', వాళ్ల తోక పత్రికల/కీటకాల సాయంతో ఇంతటి బలమైన మోదీ గారిని గద్దె దించి, భారత్‌లో ప్రభుత్వం మార్చాలని కలలు కన్నాడు!



సీసీ కెమెరాలు ఆఫ్.. పెట్రోల్ బాంబుల దాడులు

గ్లోబల్ వార్త – పులివెందుల: ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేతలు రెచ్చి పోతున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, ఏజెంట్లపై దాడులు చేస్తున్నారు. పోలింగ్ వద్ద పెట్రోల్ బాంబులు విసురుతూ అరాచకం సృష్టించారు. మరికొన్ని చోట్ల టీడీపీ నేతలు దొంగ ఓట్లు వేయడంతో అసలైన ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఖంగుతిన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. పులివెందుల మండలం ఎర్రిపల్లిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీడీపీ రౌడీలు పెట్రోల్ బాంబులతో రెచ్చిపోయారు. పోలింగ్ బూత్‌ల దగ్గర పెట్రోల్ బాంబులు వేయడంతో భారీ మంటలు ఎగిసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అలాగే, పులివెందుల మండలం కణంపల్లిలో మీ ఓట్లు అయిపోయాయి అని పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లకు పోలింగ్ సిబ్బంది చెప్పడంతో వారంతా ఖంగుతున్నారు. ఈ నేపథ్యంలో మా ఓట్లు ఎవరు వేస్తారంటూ ఓటర్లు తిరగబడ్డారు. దీంతో పోలింగ్ కేంద్రంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు.సీసీ కెమెరాలు ఆఫ్.. ఇదిలా ఉండగా.. పులివెందుల మండల పరిధిలో 19 సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటిలో 5 మాత్రమే ఆన్‌లైన్‌లో ఉన్నాయి. మిగిలినవి ఆఫ్‌లైన్‌లో ఉండటం గమనార్హం. ఇక, ఎన్నికలు జరుగుతున్న సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 1200 సీసీ కెమెరాలు ఆఫ్‌లైన్‌లో ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎందుకంటే ఆఫ్‌లైన్‌లో రికార్డు అయితే ఎడిట్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆన్‌లైన్‌లో రికార్డు అయితే ఎడిటింగ్‌కు అవకాశం ఉండదు. ఈ కారణంగా సీసీ కెమెరాలు ఆఫ్‌లైన్‌లో ఉంటే రిగ్గింగ్ చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. రైల్వే కోడూరు, పెనగలూరు మండ లం నల్లపురెడ్డిపల్లిలో టీడీపీ రౌడీలు పెట్రోల్ బాంబులు వేసి విధ్వంసం సృష్టించారు. పోలీసుల సమక్షంలోనే పెట్రోల్ బాంబులతో టీడీపీ రౌడీలు దాడులను తెగబడ్డారు. నాటు బాంబులు, పెట్రోల్ బాంబులు విసురుతూ రెచ్చిపోయారు. దీంతో, టీడీపీ గూండాల దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పలువురు గాయపడ్డారు.



ఇవి ఎలక్షన్స్ కాదు కేవలం సెలక్షన్స్ మాత్రమే

పోలింగ్ ఏజెంట్లను అనుమతించకపోవడంపై ఎంపీ అవినాష్ రెడ్డి ఆగ్రహం

గ్లోబల్ వార్త – పులివెందుల

పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్నవి ఎలక్షన్స్ కావని కేవలం సెలక్షన్స్ మాత్రమేనని, వైయస్సార్సీపి ఏజెంట్లను పోలింగ్ బూత్ లోకి అనుమతించకపోవడం పట్ల జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పోలీసుల తీరుపై మండిపడ్డారు. గురువారం కొనసాగినటువంటి స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామాలలో జరుగ తున్న పోలింగ్ సందర్భంగా వైఎస్ఆర్సిపి ఏజెంట్లను పోలింగ్ బూత్లలోకి అనుమతించక పోవడం పట్ల అవినాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు వాటిలో భాగంగానే పార్నపల్లెలో పోలింగ్ బూతు లోకి ఏజెంట్లను పోనివ్వకుండా కర్రల తో టిడిపి నేతలు అడ్డుకుంటున్నారన్న సమాచారం మేరకు పార్నపల్లెకు బయలుదేరిన ఎంపీ అవినాష్ రెడ్డికి దారి మధ్యలో పులివెందుల డిఎస్పి మురళి నాయక్ మరియు రూరల్ సీఐ శాంతి లాల్ పోలీసులతో నిర్బంధించే ప్రయత్నం చేస్తూ మీరు పార్నపల్లె ఓటర్ కాదు, మీకు పులివెందులలో ఓటు హక్కు కలదని ఈ ప్రాంతానికి రావలసిన అవసరం లేదంటూ అడ్డగించే ప్రయత్నం కొనసాగగా ఇదే ఊర్లో ఉంటున్న బీటెక్ రవి, అలాగే ప్రభాకర్ రెడ్డి, ఏ మండలాల ఓటర్లు అని అవినాష్ రెడ్డి ప్రశ్నించారు ఏజెంట్లను లోపలికి పోనివ్వకుండా ఎన్నికలు జరగడం ఒక ఎన్నికలేనా, ఇవి ఎలక్షన్స్ ఆ లేక సెలక్షన్స్ ఆ మీరే ఆలోచించాలని, మా ఏజెంట్లను లోపలికి పంపించే వరకు నేను ఇక్కడ నుంచి వెళ్ళనంటూ ఉద్రిక్తత వాతావరణం కొనసాగింది.

అధికార దుర్వినియోగంతో ఎన్నికలు

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



గ్లోబల్ వార్త – పులివెందుల

అధికార దుర్వినియోగంతో కూటమి నాయకులు ఎన్నికలు నిర్వహించారని, మా ఏజెంటుల ఏజెంట్ పారాలను బయట వ్యక్తులు దౌర్జన్యంగా చించి వేస్తున్నారని, ఏజెంట్లను బూతులలో కూడా వెళ్లకుండా అడ్డుపడుతున్నారని, పోలీసులు వారికి సకరిస్తున్నారని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం జగన్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా జడ్పిటిసి అభ్యర్థులు పెట్టిన వాటిలో రీ పోలింగ్ జరిపించాలని ఆయన అన్నారు. బయట వ్యక్తులు వచ్చి యదేచ్ఛగా పోలీసులు ముందరే రీసైకిలింగ్ చేస్తున్నారన్నారు. అచ్చువెల్లి ఎర్రిపల్లి గ్రామాలలో మహిళలు చూడకుండా పోలీసులు ఇష్టానుసారంగా బూతులు మాట్లాడడం ఏంటని ఆయన అన్నారు. ఇలాంటి పోలీసు వ్యవస్థను ఎప్పుడు చూడలేదన్నారు. వేముల మండలం, లింగాల మండలం, పులివెందుల మండలం, పెద్ద పెద్ద బూతులలో రీపోలింగ్ జరిపించాలన్నారు. ఈ బూతులలో పూర్తిగా బయట వ్యక్తులతో సైక్లింగ్ పద్ధతిలో ఓట్లు వేయించడం జరిగిందన్నారు. గ్రామాలలో ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేయడానికి వస్తే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలను స్వచ్ఛందంగా ఓట్లు వేయకుండా మా ఓట్లు మేము వేసుకుంటామన్న కూడా పోలీసులు వారిని వెళ్లనివ్వకుండా చేయడం ధారణ మన్నారు. నామినేషన్లు వేసేప్పటి నుండి ప్రతి ఒక్కటి కూటమి నాయకులు అడ్డుకోవడం జరుగుతుందన్నారు. నామినేషన్ వేసిన వారిని స్కూటీ లో ఎత్తివేయడం జరిగిందన్నారు. ఇలా దౌర్జన్యాలు చేసుకుంటూ పోతే ఎంతకాలం సాగుతుందన్నారు. కూటమి నాయకులు బయట నుండి పిల్చుకొచ్చిన వ్యక్తులపై నమ్మకం లేక ఓట్లు కూడా లోపలికి వెళ్ళినప్పుడు వాళ్ల వారే వేసుకుంటున్నారన్నారు. అంటే బయట వ్యక్తులు వారికి ఓటు వేస్తారు లేదో అన్నా అనుమానం వారికి ఉందన్నారు. తెలుగు దేశం మూకలు చేసిన దాడులలో మా వారికి చాలామందికి గాయాలు అయ్యాయి అన్నారు. ఒక పత్రిక విలేఖరి వార్తను కవర్ చేయడానికి వెళితే అతన్ని కూడా కొట్టడం జరిగిందన్నారు. అక్రమ కేసులు పెట్టి మా నాయకులను కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం జరిగిందన్నారు. ముందు రోజు ఉదయం నుండే నాయకులను తీసుకువెళ్లి పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టుకున్న పరిస్థితి నెలకొంది అన్నారు. నేను అక్కడికి వెళ్లి పోలీసులు అడిగితే ఎలక్షన్లు అయిపోయినాక సాయం త్రం వదిలిపెడతామని చెప్పడం జరిగిందన్నారు. పార్నపల్లెలో ఏజెంట్లను వెళ్లనివ్వకుండా ఉంటే నేను అక్కడికి వెళ్లి పోలీసులు తో మాట్లాడితే మీరు వెళ్ళండి మేము పంపిస్తామని చెప్పి వారిని లోపలికి పంపించి గంటకే మళ్ల బయటికి పోలీసులు పంపించిన దుస్థితి నెలకొంది న్నారు. ఎక్కడ చూసినా కూటమి నాయకులు అరాచ కాలు చేసి ఓట్లు వేసుకోవడం జరిగిందన్నారు. పులివెందుల మండలానికి సంబంధం లేని వ్యక్తులు బూతులలోకి వెళ్లి ఓట్లు వేస్తూ ఉంటే పోలీసులు వారికి సహకరించి సినిమా చూస్తు న్నారే తప్ప వారిని మందలించిన పాపాన పోలేదన్నారు. ఒరిజినల్ ఓటర్లు లోపలికి వెళ్తూ ఉంటే వారిని మాత్రం లోపలికి వెళ్ళనివ్వకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. వేములకు సంబం ధించి అక్కడే ఉన్న జిల్లా ఎస్పీకి చరవాణి ద్వారా తెలిపితే మా ఎస్ఐకి చెప్పాము ఆయనతో మాట్లా డండి అని చెప్పడం జరిగిందన్నారు. ఇక్కడ జరిగిన అన్యాయాలను, దౌర్జన్యాలను స్టేట్ ఎలక్షన్ కమిషనర్ దృష్టికి వీటిని తీసుకువెళ్లడం జరిగిందన్నారు.



అయ్యవారమ్మకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నివాళి

గ్లోబల్ వార్త – ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు పట్టణం శ్రీరామ్ నగర్ తెలుగు దేశం పార్టీ కార్యకర్త మోతుకూరు నాగ రాజు గారి భార్య అయ్యవారమ్మ మరణించిన వార్త తెలుసు కొని వారి స్వగృహం వద్ద ఉన్న భౌతికకాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి.

గుమ్మనూరులో తీవ్ర ఉద్రిక్తత

పోలింగ్ వేళ ఇరువర్గాల మధ్య ఘర్షణ
సుమారు 30 మందికి గాయాలైనట్లు సమాచారం


గ్లోబల్ వార్త– కర్నూలు జిల్లా:

ఎన్నికల పోలింగ్ వేళ కర్నూలు జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామంలో పోలింగ్ ఏజెంట్ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో సుమారు 30 మంది గాయపడినట్లు తెలుస్తోంది. పోలింగ్ ఏజెంట్ వ్యవహారంపై ఇరువర్గాల మధ్య మొదలైన వాగ్వాదం క్రమంగా తీవ్రరూపం దాల్చినట్లు తెలుస్తోంది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘర్షణలో సుమారు 30 మందికి గాయాలైనట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఘటనతో గ్రామంలో ఆందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఘర్షణకు దారితీసిన పూర్తి కారణాలు, గాయపడిన వారి వివరాలు, అధికారుల తదుపరి చర్యలకు సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉంది.



డెంగ్యూ, మలేరియా బారిన పడకుండా కాపాడుకుందాం

సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య



గ్లోబల్ వార్త – పులివెందుల

వర్షాకాలం, శీతాకాలంలో దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి మనల్ని మనం కాపాడుకోవడానికి "ఫ్రైడే – డ్రైడే" కార్యక్రమం ముఖ్యం. దోమ లు ఎక్కడో పుట్టవు, మన ఇంట్లో లేదా చుట్టుపక్కల నిల్వ ఉన్న నీటి లోనే గుడ్లు పెట్టి వేల సంఖ్యలో తయారవు తాయి. వారానికి ఒకసారైనా ఆ నీటిని తొలగిస్తే, దోమ లు పుట్టకుండా వాటిని ముందే అరి కట్టవచ్చు.

ఇళ్లలో అందరూ చేయాల్సిన పనులు:

నీటి కుండలు, కూలర్లు: ఇంట్లో వాడే కూలర్లు, కుండలు, పాత డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి బోండాలు, పాత టైర్లలో వర్షపు నీరు లేదా వాడిన నీరు అస్సలు నిల్వ ఉండకుండా బోర్లిం చాలి లేదా పారబోయాలి. ఇంట్లోని నీటి ట్యాంకు లు, డ్రమ్ములను వారానికి ఒకసారైనా పూర్తిగా ఖాళీ చేసి, కడిగి ఆరబెట్టాలి. ఫ్రిజ్ కింద ఉండే చిన్న ట్రేలో నీరు నిలబడుతుంది, దానిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధిని, చుట్టు పక్కల ప్రాంతాలను కూడా అలాగే శుభ్రంగా ఉంచుకోవాలి. "దోమల పుట్టుకను అణచి వేద్దాం... ప్రాణాంతక వ్యాధుల నుండి ప్రాణాల ను కాపాడుకుందాం." ఈ శుక్రవారాన్ని ప్రతి ఒక్కరూ 'డ్రై డే' (నీరు నిల్వ ఉండని రోజు) గా పాటించి, మన కుటుంబాన్ని, ఆరో గ్యంగా ఉంచుకుందాం.

కొమ్మనూతల పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

పోలీసుల చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఓటర్లు



గ్లోబల్ వార్త – పులివెందుల రూరల్

గురువారం కొనసాగిన జడ్పిటిసి ఎన్నికల పోలింగ్ సందర్భంగా కొమ్మనూతల పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లను పోలీసులు లోపలికి అనుమతించకపోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఏజెంట్లను పోలీసులు అడ్డుకుంటూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని స్థానిక మహిళలు, గ్రామస్తులు పోలింగ్ కేంద్రం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రజాస్వామ్య బద్ధంగా అందరికీ సమాన హక్కులు కల్పించాలని, ఏజెంట్లను లోపలికి అనుమతించాలని వారు డిమాండ్ చేశారు, అదేవిధంగా పులివెందుల మండల పరిధిలోని కొత్త పల్లె గ్రామం మోటునూతలపల్లె లో ఇళ్లలోకి వచ్చి టీడీపీ గుండాలు దాడి చేస్తున్నప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని, పోలీసులు కూడా ఓటు వెయ్యడానికి వస్తున్న వారిని అడ్డుకోవడమే కాకుండా ఓటర్లపై లాఠీ ఛార్జ్ చేస్తూ అధికార ప్రభుత్వానికి సహకరించే ప్రయత్నం చేశారని ఓటర్లు మండిపడ్డారు.

దొంగ ఓట్ల ఆరోపణలతో సాయినగర్‌లో ఉద్రిక్తత



గ్లోబల్ వార్త – తిరుపతి : చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ వేళ రాజకీయ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. సాయినగర్ పంచాయతీతో పాటు మంగళం, ఓటేరు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద దొంగ ఓట్లు, రిగ్గింగ్ జరుగుతున్నాయంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఈ పరిణామాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగడం స్థానికంగా చర్చనీయాంశమైంది. చంద్రగిరి సాయినగర్ పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాల సమీపంలో పెద్ద సంఖ్యలో బయటి వ్యక్తులు మోహరించారంటూ వైఎస్సార్‌సీపీ వర్గాలు ఆరోపించాయి. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో అను మానాస్పదంగా వ్యక్తులు తిరుగుతుండటంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో సాయి నగర్ పంచాయతీ వద్దకు చేరుకున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఓ గదిలో ఉన్నారని అనుమానించిన వ్యక్తుల ను గుర్తించి ప్రశ్నించినట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి. ఆయనను గమనించిన కొందరు అక్కడి నుంచి పరుగులు తీశారని పేర్కొన్నాయి. ఈ సమయంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అడ్డుకునేందుకు టీడీపీ శ్రేణులు ప్రయత్నించాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. దొంగ ఓట్ల ఆరోపణలు, బయటి వ్యక్తుల మోహరింపు, ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదంతో చంద్రగిరి నియోజకవర్గం లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. పోలింగ్ ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శిరిడి సాయినాథునికి విశేష పూజలు

ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



గ్లోబల్ వార్త – పులివెందుల అర్బన్

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయి బాబా ఆలయంలో గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాథునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు . మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామి వారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి గురు వారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియ జేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు

మున్సిపల్ ఫలితాల తర్వాత రాజకీయ వేడి

పోలీసుల అరెస్టులపై బైరెడ్డి ఫైర్!



నందికొట్కూరు, గ్లోబల్ వార్త :

నందికొట్కూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల అరెస్టుల వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అధికార కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పోలీసుల అదుపులో ఉన్న తమ పార్టీ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో బుధవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంది కొట్కూరు నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పరిషత్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులను పోలీ సులు అదుపులోకి తీసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. తమ పార్టీ నాయకులు ఎక్కడ ఉన్నారో వారి కుటుంబ సభ్యులకు, పార్టీ శ్రేణులకు స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా పోలీసులు వ్యవహరి స్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన నందికొట్కూరు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేకే అధికార పార్టీ నేతలు ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరో పించారు. ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి అరెస్టుల ద్వారా వైసీపీ శ్రేణులను భయభ్రాం తులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

పాత్రికేయునిపై టిడిపి శ్రేణుల దాడి



గ్లోబల్‌వార్త – లింగాల

గురువారం స్థానిక సంస్థల ఎన్నికల కవరేజ్ సందర్భంగా టిడిపి శ్రేణులు పాత్రికేయులపై దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. లింగాల మండలం ఇప్పట్ల పోలింగ్ కేంద్రం వద్ద సాక్షి విలేకరి పుల్లారెడ్డి పై టీడీపీ శ్రేణుల దాడిలో పుల్లారెడ్డి గాయపడడం జరిగింది, విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పాత్రికేయుడు పుల్లారెడ్డిని పరామర్శించి అందించే ప్రయత్నం చేశారు. పాత్రికేయునిపై దాడి సంఘటన దురదృష్టకరమని ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి సంఘటనలకు అవకాశం లేదని దాడికి పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

గ్లోబల్ వార్త – పులివెందుల

ఆడపిల్లల హక్కులను పరిరక్షిస్తూ, లింగ వివక్షను నిర్మూలించేందుకు పిసిపిఎన్‌డిటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. ఖాజా మొనుద్దీన్ సూచించారు. గురువారం పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆయన ఆధ్వర్యంలో సబ్ డిస్ట్రిక్ట్ స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, లింగ ఎంపికకు ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, స్కానింగ్ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రికార్డుల నిర్వహణ, తనిఖీలు, చట్ట ఉల్లంఘనల నివారణపై చర్చించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీకాంత మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్షను తొలగించి, వారికి సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఆర్.ఎం.ఓ. డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు చట్ట నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం పి.సి.డ పి.ఎన్.డి.టి. చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని, ప్రభుత్వ శాఖలు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి బాలికల హక్కులను పరిరక్షించాలని పేర్కొన్నారు.

సర్వేపల్లిలో ఎవరిది పైచేయి?అధికార ఒత్తిళ్లను లెక్కచేయని వైసీపీ శ్రేణుల తెగువ చారిత్రాత్మకం

నెల్లూరు, గ్లోబల్ వార్త:

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ వేళ నెల్లూరు జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార యంత్రాంగం, పోలీసుల తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసుల ఒత్తిళ్లు, బెదిరింపులను సైతం లెక్కచేయకుండా ఎన్నికల బరిలో నిలబడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల తెగువ చారిత్రాత్మకమని కొనియాడారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితతో కలిసి ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అధికార యంత్రాంగం, పోలీసుల వ్యవహారశైలిపై పలు ఆరోపణలు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి తెలుగుదేశం పార్టీతో రాజకీయ పోటీ పడటం కంటే పోలీసు వ్యవస్థతోనే పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి తమ ఓటర్లను అడ్డుకుంటున్నారని, ఇతర ప్రాంతాల్లో మాత్రం నామ మాత్రపు బందోబస్తు కొనసాగుతోందని విమర్శించారు. తమ పార్టీకి చెందిన క్రియాశీలక నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారని కాకాణి ఆరోపించారు. ఓటు వేసేందుకు వెళ్లే వారిని అడ్డుకోవడంతో పాటు, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లే పార్టీ శ్రేణు లను కూడా వివిధ పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఒక పోలీస్ స్టేషన్‌లో తమ వారు ఉన్నారని తెలుసుకుని అక్కడికి వెళితే మరో స్టేషన్‌కు మార్చుతున్నారని విమర్శించారు. ఏజెంట్లను సైతం పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నా రని ఆరోపించారు. నెల్లూరు జిల్లాలో కొన్ని స్థానాలను కుట్రలు, కుతంత్రాలతో ఏకగ్రీవం చేసుకున్నప్పటికీ మిగిలిన స్థానాల్లో పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాటం కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ నీతి, అవినీతి.. ధర్మం, అధర్మం.. న్యాయం, అన్యాయం మధ్య జరుగుతున్న పోరాటమని అభివర్ణించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా పోరాడుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ వందకు వంద శాతం విజయం సాధిస్తుందని పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ పార్టీ విధానమని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్య ఉంటున్నారని చెప్పారు. ఈరోజు ఎదురైన ఇబ్బందులకు రేపు వెలువడే ఎన్నికల ఫలితాలే సమాధానం చెబుతాయని పూజిత పేర్కొన్నారు.



రాప్తాడులో ప్రశాంతంగా పరిషత్ పోలింగ్..
వైసీపీ ఆరోపణలపై పరిటాల సునీత ఫైర్

గ్లోబల్ వార్త -రాప్తాడు

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో పరిటాల కుటుంబం తమ ఓటు హక్కును వినియోగించుకుంది. నసన కోట ప్రభుత్వ పాఠశాలలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపారు. వైసీపీ గొడ్డలి పార్టీ వారు అనవసరంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాప్తాడు నియోజకవర్గంలో రిగ్గింగ్ చేస్తున్నారని వైసీపీకి చెందిన కొందరు మాట్లాడటం సబబుకాదన్నారు.ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికలలో క్లీన్ స్వీప్ చేయబోతుందని పరిటాల శ్రీరామ్ ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఇక జిల్లాలో ఉదయం 9 గంటలకు 12.66 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.



గ్లోబల్ వార్త - అమరావతి

తెలంగాణా – ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ శ్రీ శ్రీనివాస్ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుతో నేడు సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏపీ తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించి స్థానిక మిలటరీ లోకల్ అథారిటీగా వివిధ అంశాలను ఆయన సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సైనిక దళాలకు పూర్తి స్థాయిలో సహకారం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

ఆధార్‌కు బదులుగా ఓటర్ ఐడి నిబంధన వద్దు
పేదలను సంక్షేమానికి దూరం చేయొద్దు : సిపిఎం ఖండన

గ్లోబల్ వార్త - న్యూఢిల్లీ : సంక్షేమ పథకాల చెల్లింపులకు ప్రాతిపదికగా ఆధార్‌కు బదులుగా బయోమెట్రిక్స్‌ను, ఓటర్ ఐడి (ఎపిక్)ను తీసుకు వస్తామంటూ పంచాయితీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేసిన కేంద్ర ప్రభుత్వ ప్రకటనను సిపిఎం తీవ్రంగా ఖండించింది. గ్రామీణ పేదలపై ఇది మరో దాడి అని వ్యాఖ్యానించింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. గ్రామీణ ఉపాధి పథకాల్లో వ్యవసాయ కార్మికులకు బయోమెట్రిక్‌ను ప్రామాణీకరించడం ఏ విధంగా ప్రవేశాన్ని నిరాకరించిందో ఇప్పటికే పదే పదే రుజువైంది. చాలామంది వృద్ధులైన మహిళా కార్మికులకు వారి కనురెప్పల (ఐరిస్)ను యంత్రాలు గుర్తించడంలో విఫలం కావడంతో వారికి అందాల్సిన ప్రయోజనాలు అందలేదు. అలాగే శారీరక శ్రమ చేసే కూలీలకు కూడా వారి అరిగిపోయిన వేలిముద్రలను బయోమెట్రిక్ వ్యవస్థ సరిగా పోల్చకపోవడంతో వారిని కూడా మినహాయిస్తున్నారు. ఇ-కెవైసికి స్మార్ట్ ఫోన్లు అవసరమవుతున్నాయి. చాలామంది గ్రామీణ కుటుంబాలకు అటువంటి ఫోన్లు వుండవని పొలిట్ బ్యూరో పేర్కొంది. ఆధార్‌ను తప్పనిసరి చేయబోమని గతంలో ప్రభుత్వం సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చింది. కానీ సంక్షేమ పథకాలన్నిం టిలోనూ దాన్ని రహస్యంగా విధించే ప్రయత్నం జరుగుతోంది. కానీ, లోపరహితమైనదిగా గొప్పగా చెప్పుకున్న ఆధార్‌ని ఇప్పుడు ప్రభుత్వమే పక్కనబెడుతోందని సిపిఎం విమర్శించింది. ఓటింగ్ హక్కులపై సర్జికల్ దాడిగా, మూకుమ్మడిగా ఓటు హక్కులను తొలగించేందుకు ఒక పద్ధతి ప్రకారం సాగే ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో పాటే దీన్ని కూడా చూడాల్సి వుంది. ఇప్పటికే 13.4కోట్ల మందికి పైగా ఓటర్లను తొలగించారు. వీరిలో వెనుకబడిన కమ్యూనిటీలు, ముస్లింలు, మహిళలు, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందినవారు ప్రధానంగా ప్రభావితుల య్యారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఇప్పుడు, సంక్షేమ పథకాలకు ఓటర్ ఐడి కావాలనడం వల్ల పేదలకు మరింతగా దూరమవుతాయి. ఇప్పటికే, ఎస్ఐఆర్ ద్వారా పేర్లు తొలగించబడ్డాయనే సాకుతో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్, ఇతర ప్రయోజనాలను నిరాకరిస్తున్నాయి. ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినంత మాత్రాన అది సామాజిక సంక్షేమ అర్హతలను ప్రభావితం చేయరాదన్న సుప్రీం కోర్టు రూలింగ్‌ను ఇది స్పష్టంగా ఉల్లంఘించడమేనని సిపిఎం పేర్కొంది. ఈ ఎత్తుగడలన్నీ కూడా మెజారిటీ ప్రజలకు ప్రయోజనాలు అందకుండా నిరాకరించేందుకు కట్టుదిట్టంగా జరుగుతున్న ప్రయత్నంగా కనిపిస్తున్నాయని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. గ్రామీణ నిరుపేదలకు అందుబాటులో లేని సాంకేతికత లేదా పత్రాలు కావాలని షరతులు విధించకుండా సంక్షేమ హక్కులను సార్వజనీనంగా అందచేయాలని కోరింది.


వైసీపీ దాడులు, ఎన్నికల ఉల్లంఘనలపై
ఎస్ఈసీకి టీడీపీ ఎమ్మెల్యేల ఫిర్యాదు



గ్లోబల్ వార్త - అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఎస్ఈసీకి టీడీపీ ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ ఫిర్యాదు చేశారు. పులివెందులలో పెట్రోల్ బాంబులతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిన వైసీపీ శ్రేణుల అరాచకాలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. సంతనూతలపాడు, సత్తెనపల్లి, చీరాల, చంద్రగిరి, పులివెందుల నియోజకవర్గాల్లో వైసీపీ నేతల దౌర్జన్యాలు, అక్రమాలు, ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీని టీడీపీ ఎమ్మెల్యేలు కోరారు.11 గంటలకు సగటున 21.12 శాతం పోలింగ్ ఇక ఏపీ వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఉదయం 11 గంటల సమయా నికి సగటున 21.12 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా మార్కాపురం జిల్లాలో 34.66 శాతం మేర పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా ూూ= జిల్లాలో 11.81 శాతం మాత్రమే పోలింగ్ నమోదు అయ్యింది. చిత్తూరులో 29.87 శాతం, అనంతపురంలో 28.88 శాతం, గుంటూరులో 28.69శాతంగా పోలింగ్ నమోదు అయ్యింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 27.45 శాతం, వైఎస్ఆర్ కడపలో 26.85 శాతం, విశాఖపట్నంలో 26.77 శాతంగా పోలింగ్ కొనసాగుతోంది. కృష్ణా జిల్లాలో 25.81 శాతం, విజయనగరంలో 25.25 శాతం, నంద్యాలలో 25.41శాతం పోలింగ్ నమోదైంది. అటు తూర్పుగోదావరి జిల్లాలో 13.75 శాతం, పల్నాడులో 14.02 శాతం, ప్రకాశంలో 15.76 శాతంతో పోలింగ్ మందకొడిగా సాగుతోంది.

మహాకవి దాశరథి స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకం



గ్లోబల్ వార్త – హైదరాబాద్: తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్ని ధారలుగా మలిచి, తన పద్యాలనే పదునైన ఆయుధాలుగా చేసుకుని నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. తెలంగాణ విముక్తి ఉద్యమంలో తన కలంతో, గళంతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిన ఆయన చిరస్మరణీయుడు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ తెలంగాణ ఆత్మగౌర వాన్ని ప్రపంచానికి చాటిన ఉద్యమ కవి.1925 జూలై 22న మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరులో దాశరథి వెంకటాచార్య, వెంకటమ్మ దంపతులకు జన్మించారు. ఆయన బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యు లేషన్ పూర్తి చేసి, భోపాల్ విశ్వవిద్యా లయం నుంచి ఇంటర్మీ డియట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల సాహిత్యంలో బీఏ చదివారు. సంస్కృతం, తెలుగు, ఉర్దూ, ఆంగ్లభాషల్లో మంచి పాండిత్యం సంపాదిం చారు. చిన్నతనం లోనే పద్యరచనలో ప్రతిభ కనబరిచారు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా పనిచేశారు. అనంతరం హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరం కుశ పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా ఉద్యమంలో భాగ స్వాము లయ్యారు. నిజాం పాలనలో రైతులు, కూలీలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న దోపిడీ, వెట్టిచాకిరీ, అణచివేత లను చూసి చలించిపోయారు. పీడిత ప్రజల గొంతుకగా మారి తన రచనలతో పాలకులను నిలదీశారు. "ఓ నిజాం పిశాచమా! కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని" అంటూ నిజాం పాలనపై తీవ్రంగా విరుచుకు పడ్డారు. "రైతుదే తెలంగాణము రైతుదే" అంటూ తెలంగాణపై రైతాంగానికి ఉన్న హక్కును చాటారు. "దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగా రాలు కొడుతున్నది" అంటూ తన కవిత్వంతో ప్రజల్లో చైతన్యం నింపారు. ఆంధ్ర మహాసభలో చురుకైన పాత్ర పోషించినందుకు నిజాం ప్రభుత్వం ఆయనకు జైలు శిక్ష విధించింది.జామాబాద్‌లోని ఇందూరు కోటలో మరో 150 మందితో కలిసి ఖైదీగా ఉంచింది. అదే జైలులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నారు. జైలులో పళ్లతోముకోవడానికి ఇచ్చే బొగ్గుతో గోడలపై పద్యాలు రాసినం దుకు దెబ్బలు తిన్నా తన రచనా సంకల్పాన్ని వీడలేదు. ఆయనకు కవిత్వం కేవలం సాహిత్య ప్రక్రియ కాదు, ప్రజల విముక్తి కోసం సాగించిన పోరాటం. మంచి ఉపన్యాస కుడైన దాశరథి తన భావో ద్వేగ ప్రసంగాలతో ఊరూరా పర్యటించి సాంస్కృతిక చైతన్యాన్ని వ్యాప్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాణంలో భాగస్వా ములయ్యారు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపిం చి అధ్యక్షుడిగా జిల్లాల్లో సాహిత్య చైతన్యానికి కృషి చేశారు. ఉపా ధ్యాయుడిగా, పంచాయతీ ఇన్‌స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. కథలు, నాటికలు, కవితలు, సినిమా పాటలు రచించారు. మీర్జా గాలిబ్ ఉర్దూ గజళ్లను తెలుగు లోకి అనువదించి 'గాలిబ్ గీతాలు' పేరుతో వెలువరించారు. 1977 ఆగస్టు 15 నుంచి 1983 వరకు ఆంధ్ర ప్రదేశ్ ఆస్థాన కవిగా పనిచేశారు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. ఆయన రచించిన తల్లి, తల్లి తెలంగాణ పద్యాలు నేటికీ పాఠకుల్లో స్ఫూర్తిని నింపుతున్నాయి. 1987 నవంబరు 5న దాశరథి కన్నుమూశారు. ఆయన జయంతి సందర్భంగా తెలం గాణ ప్రభుత్వం సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన వారికి దాశరథి సాహితీ పురస్కారాలను అందిస్తోంది. తెలంగాణ విముక్తి కోసం తన జీవితాన్ని, సాహిత్యాన్ని అంకితం చేసిన దాశరథి కృష్ణమాచార్య కు తగిన గౌరవం దక్కాలి. ఆయన జన్మించిన మహబూబాబాద్ జిల్లాకు దాశరథి పేరు పెట్టాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలించాలి. ఆయన రచనలను పాఠశాలలు, కళాశా లల్లో విస్తృతంగా పరిచయం చేయాలి. దాశరథి సాహిత్యాన్ని అధ్యయనం చేయడం అంటే తెలంగాణ చరిత్రను, ఆత్మగౌరవ పోరాటాన్ని, ప్రజల విముక్తి ఆకాంక్షలను అర్థం చేసుకోవడమే. అక్షరాన్ని ఆయుధంగా మలిచి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహాకవి దాశరథి స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకం కావాలి

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని
ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఆకస్మిక తనిఖీ



గ్లోబల్ వార్త - ప్రొద్దుటూరు

పొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు ఆకస్మిక తనిఖీ చేసి ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు స్కానింగ్లు, ప్రభుత్వ ఆసుపత్రి లోనే తీయాలని,ప్రైవేట్ ఆసుపత్రులకు పంపియ వద్దని, ఆసుపత్రికి వచ్చే రోగులతో ప్రేమతో నడుచుకోవాలని,ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది ఎవరైనా దురుసుగా ప్రవర్తించిన డబ్బులు డిమాండ్ చేసిన కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సిబ్బందిని హెచ్చరించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఈ కార్య క్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి గారు,ఆసుపత్రి సూపరిం టెండెంట్ ఆనంద్ బాబు గారు,ఖణా రాజుపాలెం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికల్లో ఘర్షణలు ... ఇద్దరిపై దాడి



గ్లోబల్ వార్త - అనంతపురం ఏపీలో పరిషత్ ఎన్నికలు కొనసాగుతుండగా.. పలు చోట్ల వైసీపీ శ్రేణులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. వైసీపీ మూకల దాడులపై కూటమి నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనంత పురం జిల్లాలోనూ గొడ్డలిపార్టీ శ్రేణులు రెచ్చి పోయారు. జిల్లా లోని బ్రహ్మసముద్రం మండ లం పోలేపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి పాలబండ్ల శ్రీరాములు గ్రామంలోకి అడుగుపెట్టగానే వైసీపీ నేతలు అడ్డుకున్నారు. వైసీపీ నేతల అడ్డుకోవడంతో మొదలైన గొడవ... ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వాదంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాల వారిని చెదర గొట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం పోలేపల్లిలో యథావిధిగా పోలింగ్ కొనసాగుతోంది. వైసీపీ అల్లరి మూకల దాడిలో టీడీపీ అభ్యర్థి సోదరుడు తీవ్రంగా గాయ పడ్డారు. మరోవైపు అనంతపురం జిల్లా శెట్టూరు మండలం చింతర్లపల్లి ఎంపీటీసీ అభ్యర్థి చెన్నకేశవ సోదరు డిపై వైసీపీ గుండాలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. దీంతో గాయ పడిన మల్లిని హుటాహుటిన ఆస్పత్రికి తరలిం చారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ సృష్టిస్తున్న అల్లర్లపై టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పోలింగ్ కేంద్రాల్లో రాజకీయ సందడి

గ్లోబల్ వార్త- కర్నూలు :

గ్రామీణ రాజకీయాల్లో మరోసారి ఎన్నికల వేడి కనిపించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పలువురు రాజకీయ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న నేతలు ఓటు వేయడంతో మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల్లో రాజకీయ సందడి నెలకొంది. మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. అదే విధంగా మంత్రాలయం ఎంపీపీ అభ్యర్థి శారదమ్మ కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మరోవైపు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తన స్వగ్రామమైన రాంపురంలో ఓటు వేశారు. కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలాల్లోనూ జడ్పీటీసీ, ఎంపీపీ అభ్యర్థులు కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్‌లో పాల్గొన్నారు. ఇక ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి తనయుడు దినేష్ ఆలూరులో ఓటు హక్కును వినియోగించు కున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు స్వయంగా పోలింగ్‌లో పాల్గొనడంతో ఆయా గ్రామాల్లో ఎన్నికల సందడి మరింత పెరిగింది. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటుండగా, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది.

టీడీపీ ఎమ్మెల్యే సతీమణి హల్‌చల్..
సుధా రెడ్డి ఇదేం తీరు?



గ్లోబల్ వార్త - చంద్రగిరి: ఏపీలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ వేళ చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ నేతలను టీడీపీ నేతలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీంతో, సుధారెడ్డిపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఇదేం తీరని ప్రశ్నిస్తున్నారు. చంద్రగిరిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న సమయంలో సుధారెడ్డి కూడా ఆయన వాహనాన్ని అనుసరిస్తూ అక్కడికి చేరుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. ఆయన ఎక్కడికి వెళ్తే సుధారెడ్డి అటే వెళ్లడం గమనార్హం.చంద్రగిరి నియోజకవర్గంలో ప్రశాంతంగా పోలింగ్ జరగాల్సిన సమయంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పర్యటనలపై సుధారెడ్డి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడికే తాము కూడా వెళ్తామని స్పష్టం చేస్తూ హడావుడి చేశారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కారును సుధారెడ్డి తన వాహనంతో వెంబడించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. 'నేను ఎస్కార్ట్.. చెవిరెడ్డి వెంటే ఉంటా.. ఆయన ఎక్కడికి వెళ్తే మా వాహనం కూడా అక్కడికే వెళ్తుంది' అంటూ ఆమె కామెంట్స్ చేస్తూ చెవిరెడ్డిని రెచ్చగొట్టేలా వ్యవహరించేందుకు ప్రయత్నించారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సహనం పాటించిన చెవిరెడ్డి

పోలింగ్ కేంద్రాల వద్ద పర్యటిస్తున్న సమయంలో ఎదురైన ఈ పరిణామాలపై చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంయమనం పాటించారు. ప్రత్యర్థి వర్గం నుంచి ఎదురైన సవాళ్లకు స్పందించకుండా తన పర్యటన కొనసాగించారు. మొత్తంగా చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ సమయంలో చోటు చేసు కున్న ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల వేళ నాయకులు, వారి అనుచరులు సంయమనం పాటించి ప్రశాంత పోలింగ్‌కు సహకరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.



పోలింగ్ సరళిని పరిశీలించిన
రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

గ్లోబల్ వార్త - గుంటూరు

గుంటుపల్లి రైల్వే వాగన్ వర్క్‌షాప్ కాలనీలోని కేంద్రీయ విద్యాలయ-2 పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ. – పోలింగ్ నిర్వహణ తీరు, ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. – పోలింగ్ సరళి, ఓటింగ్‌కు సంబంధించిన వివరాలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. – ఇప్పటివరకు 10 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. – ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



ఎంపిటిసి సిపిఎం అభ్యర్థిపై దాడి

ఉల్చాల ఎంపిటిసి 1 సిపిఎం అభ్యర్థి ధర్మవరం రాఘవేంద్ర నీ కాలర్ పట్టి బయటికి లాక్కొచ్చి కార్లో వేసిన ఎస్సై రామాంజనేయులు పై చర్యలు తీసుకోవాలి-సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ ఉల్చాల ఫూజ 1 సిపిఎం అభ్యర్థి డి.రాఘవేంద్ర నీ తాలూకా ఎస్సై రామాంజనేయులు ఊర్లో గొడవలు పెట్టడానికి పోటీ చేసావా అంటూ పోలింగ్ బూతుల దగ్గర నుండి కాలర్ పట్టుకొని లాక్కొచ్చి బయటికి వేయడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయటమే అని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తెలిపారు. విధులు సక్రమంగా నిర్వహించకుండా పక్ష పాతంగా వ్యవహరిస్తూ తెలుగుదేశం ఏజెంటు లాగా పని చేసిన ఎస్సై రామాంజనేయులుపై శాఖ కపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైసీపీ దాడులు, ఎన్నికల ఉల్లంఘనలపై ఎస్ఈసీకి టీడీపీ ఎమ్మెల్యేల ఫిర్యాదు

గ్లోబల్ వార్త – అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఎస్ఈసీకి టీడీపీ ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ ఫిర్యాదు చేశారు. పులివెందులలో పెట్రోల్ బాంబులతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిన వైసీపీ శ్రేణుల అరాచకాలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. సంతనూతలపాడు, సత్తెనపల్లి, చీరాల, చంద్రగిరి, పులివెందుల నియోజకవర్గాల్లో వైసీపీ నేతల దౌర్జన్యాలు, అక్రమాలు, ఎన్నికల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీని టీడీపీ ఎమ్మెల్యేలు కోరారు.

11 గంటలకు సగటున 21.12 శాతం పోలింగ్

ఇక ఏపీ వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఉదయం 11 గంటల సమయానికి సగటున 21.12 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా మార్కాపురం జిల్లాలో 34.66 శాతం మేర పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా ూూ= జిల్లాలో 11.81 శాతం మాత్రమే పోలింగ్ నమోదు అయ్యింది. చిత్తూరులో 29.87 శాతం, అనంతపురంలో 28.88 శాతం, గుంటూరులో 28.69శాతంగా పోలింగ్ నమోదు అయ్యింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 27.45 శాతం, వైఎస్ఆర్ కడపలో 26.85 శాతం, విశాఖపట్నంలో 26.77 శాతంగా పోలింగ్ కొనసాగుతోంది. కృష్ణా జిల్లాలో 25.81 శాతం, విజయనగరంలో 25.25 శాతం, నంద్యాలలో 25.41శాతం పోలింగ్ నమోదైంది. అటు తూర్పుగోదావరి జిల్లాలో 13.75 శాతం, పల్నాడులో 14.02 శాతం, ప్రకాశంలో 15.76 శాతంతో పోలింగ్ మందకొడిగా సాగుతోంది.



బ్లింకిట్ అంబులెన్స్ సేవల్లో మార్పులు..

ఇకపై నాన్ ఎమర్జెన్సీ బుకింగ్‌కు రూ.2,500 ఛార్జీ

ఇన్ని రోజులూ పూర్తి ఉచితంగా అంబులెన్స్ సేవలందించిన బ్లింకిట్ సంస్థ తమ విధానాలను సవరించింది. ఇకపై ఆ సంస్థ ఎమర్జెన్సీ, నాన్- ఎమర్జెన్సీ కేటగిరీల్లో ఈ సేవలను అందించనుంది. ప్రాణాపాయ స్థితి (జుఎవతీస్రవఅఎఎ జశీఅఎఱ్ఱఅశీఅ)లో ఉన్న పేషెంట్లకు ఎప్పటిలాగే ఫ్రీ అంబులెన్స్ సదుపాయం కల్పించనుంది. అయితే నాన్- ఎమర్జెన్సీ అవసరాల కోసం అంబులెన్స్ బుక్ చేస్తే మాత్రం రూ.2,500 ఛార్జీ కింద వసూలు చేయనుంది. ఈ విషయాన్ని బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ ఈరోజు (గురువారం) ఎక్స్ వేదికగా వెల్లడించారు.

రెండేళ్ల క్రితం 'పది నిమిషాల్లో అంబులెన్స్' కాన్సెప్ట్‌తో బింక్లిట్ ఈ రంగంలో ప్రవేశించింది. ఉచితంగా అందులోనూ అత్యంత వేగంగా అంబులెన్స్ సేవలు అందించింది. ఈ క్రమంలో కొందరు నాన్- ఎమర్జెన్సీ అవసరాల కోసం ఈ ఉచిత సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారని ఆ సంస్థ గ్రహించింది. రెగ్యులర్ చెకప్స్ కోసం, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కావడం కోసం బ్లింకిట్ అంబులెన్స్ బుక్ చేస్తున్నారని గుర్తించింది. అందుకే నాన్- ఎమర్జెన్సీ బుకింగ్‌కు రూ.2,500 వసూలు చేయాలని నిర్ణయించింది. అయితే ఎమర్జెన్సీ కండిషన్‌లో మాత్రం అంబులెన్స్ సేవలు పూర్తి ఉచితంగానే ఉంటాయని దీపిందర్ గోయల్ తెలిపారు.

సాహస బాలికకు ఎమ్మెల్యే దగ్గుపాటి అభినందన

గ్లోబల్ వార్త –అనంతపురం క్రైం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రాప్తాడు పాఠశాలలో ఉన్మాది నుంచి స్నేహితురాలిని కాపాడటంలో లక్ష్మి చూపిన తెగువ స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర(ప్రసాద్ ప్రశంసించారు. బుధవారం ఆయన ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పదోతరగతి విద్యార్థిని లక్ష్మిని పరామర్శించారు. ఆమె ఆరోగ్యపరిస్థితిపై సూపరింటెండెంట్, వైద్యులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. లక్ష్మి ఆరోగ్యం ప్రస్తుతం బాగుందని అన్నారు. వైద్యుల నివేదిక మేరకు మరో రెండు, మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా స్నేహితురాలిని కాపాడేందుకు లక్ష్మి ప్రదర్శించి అసాధారణ ధైర్యం ప్రశంసనీయం అన్నారు. బెంగళూరులో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న మరో బాలిక ఆరోగ్యం కూడా క్రమంగా మెరుగవుతోందని తెలిపారు. బాలిక ఆరోగ్యం విషయంలో మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు.

రాప్తాడు బాధితురాలికి శస్త్రచికిత్స విజయవంతం

మంత్రి సత్యకుమార్ యాదవ్



గ్లోబల్ వార్త – అమరావతి

రాప్తాడు ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. బాధితురాలికి వైద్యులు అందిస్తున్న చికిత్స సత్ఫలితాలను ఇస్తోందని, ఆమె ఆరోగ్య పరిస్థితిలో ఆశాజనకమైన మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు.

ముఖ్యంగా బాలిక కుడి భుజానికి నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతం కావడం ఉపశమనం కలిగించే విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం బాధితురాలు మంచం నుంచి లేచి కుర్చీలో కూర్చునే స్థితికి వచ్చిందని.. నిలబడేందుకు, నడిచేందుకూ ఆసక్తి చూపిస్తున్నారని వెల్లడించారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన బాధితురాలు క్రమంగా కోలుకుంటుం డటంతో కుటుంబ సభ్యుల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయి. వైద్యుల పర్యవేక్షణలో ఆమెకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు నిరంతరం అందుతున్నాయి.

సాధారణ స్థితిలో శ్వాస, రక్త ప్రసరణ..

ప్రస్తుతం బాధితురాలు శ్వాసక్రియ, రక్త ప్రసరణ సాధారణ స్థితిలోనే ఉన్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. మరోవైపు బాధితురాలు నోటి ద్వారా ఆహారం తీసుకోవడం కూడా ప్రారంభించారని తెలిపారు. ఇది ఆమె కోలుకునే ప్రక్రియలో సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఐవీ ద్వారా అవసరమైన మందులు అందించడంతో పాటు నొప్పి నివారణ చికిత్సను కూడా వైద్యులు కొనసాగిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ.. మరింత త్వరగా కోలుకునేందుకు వైద్య బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వైద్యుల సూచనలు, పర్యవేక్షణ మధ్య చికిత్స కొనసాగుతుండగా.. బాధితురాలు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

తిరుపతి లడ్డూ కేసు.. ఇతర రాష్ట్రాలకు విచారణ బదిలీకి సుప్రీంకోర్టు నో

గ్లోబల్ వార్త – ఢిల్లీ తిరుపతి లడ్డూ కల్తీ కేసు విచారణను ఏపీ వెలుపలకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ కేసును ఇతర రాష్ట్రానికి బదిలీ చేయాలన్న పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ప్రస్తుత దశలో కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. మహారాష్ట్రకు చెందిన డెయిరీ పరిశ్రమ వ్యాపారవేత్త, మాల్గంగా మిల్క్ అండ్ అగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మచీంద్ర శాంతారాం లంకే ఈ పిటిషన్ దాఖలు చేశారు. తిరుపతి లడ్డూ నెయ్యి కల్తీ కేసులో ఆయన నింది తుల్లో ఒకరు. అయితే ఈ పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం నిరాకరించింది.

ఏపీలో కేసు విచారణకు అనుకూల వాతావరణం లేదని కోర్టుకు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వరుసగా రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే కేసును పొరుగు రాష్ట్రానికి బదిలీ చేయాలని సీనియర్ న్యాయవాది కోరారు. సుప్రీంకోర్టు గతంలో



ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా అలాంటి వ్యాఖ్యలు చేశారా? అని జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ ప్రశ్నించారు. 'మా ఆదేశాలతో వారందరినీ మౌనంగా ఉండేలా చేశాం. ఏదైనా జరిగితే మీరు మా వద్దకు రావచ్చు' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. కేసు బదిలీకి తగిన కారణాలు కనిపించడం లేదని చెబుతూ.. ప్రస్తుత దశలో విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలన్న పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రకటించారు.

కొత్తపట్నం బీచ్‌కు కొట్టుకొచ్చిన తమిళనాడు మత్స్యకారుల బోటు.. నలుగురి మృతదేహాల గుర్తింపు

గ్లోబల్ వార్త – ప్రకాశం జిల్లా

ప్రకాశం జిల్లాలోని కొత్తపట్నం సముద్ర తీరంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తమిళనాడుకు చెందిన మత్స్యకారుల బోటు సముద్రంలో బోల్తా పడటంతో తొమ్మిది మంది మత్స్యకారులు గల్లంతయ్యారు. ఈ ప్రమాదంలో ఇప్పటికే నలుగురి మృత దేహాలు కొత్తపట్నం సముద్ర తీరానికి కొట్టుకొచ్చాయి. మిగిలిన వారి ఆచూకీ కోసం అధికారులు.. సహాయక బృందాలు సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ నెల 3వ తేదీన నిజాంపట్నం నుంచి రామాయపట్నం వైపు వెళ్తుండగా కొత్తపట్నం సమీపంలో ఈ ప్రమాదం జరిగి నట్లు తెలుస్తోంది. సముద్రంలో అలల ఉద్ధృతికి మత్స్యకారుల బోటు బోల్తా పడినట్లు సమాచారం. ప్రమాదానికి గురైన బోటు తీరానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో సముద్రంపై తేలుతూ కనిపించింది. ఈ




బోటు తమిళనాడులోని కాశీమేడ్‌కు చెందినదిగా అధికారులు గుర్తించారు. తొమ్మిది మంది మత్స్యకా రులు సముద్రంలో గల్లంతు కావడం వారిలో నలుగురు మృత్యు వాత పడటంతో మత్స్యకార కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



అనవసర గొడవలతో నష్టపోకండి

గ్లోబల్ వార్త – తాడిపత్రి(అనంతపురం): మాలాంటి నాయకులంతా బాగానే ఉంటామని, అనవసర గొడవలతో నష్టపోయేది కింది స్థాయి కేడరేనని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో యల్లనూరు, పుట్లూరు, యాడికి మండలాల్లో జరిగిన ఘటనల గురించి మాట్లా డారు. ఈ మూడు మండలాల్లో ఈ వారంలో జరిగిన సంఘటన వల్ల నష్టపోయినది మీరే నన్న విషయం తెలుసుకుని గొడవల జోలికి వెళ్లవద్దని కార్యకర్తలకు సూచిం చారు. ఇటీవల జరిగిన ఘర్షణల్లో నష్టపోయిన వారికి ఎన్నికల అనంతరం చేతనైన సాయం చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. యల్లనూరు, పుట్లూరు మండలాల్లో జరిగిన ఘటనల్లో నష్టపోయిన వారికి క్షమాపణ చెప్తున్నట్లు పేర్కొన్నారు. ఆ రెండు మండలాల్లో ఫ్యాక్షన్ నశించి, అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.



అరగంట కుబేరుడు..

గ్లోబల్ వార్త – హిందూపురం(అనంతపురం): ఒక వ్యక్తి కలలోనో, సినిమాలోనో కాదు.. నిత్య జీవితంలోనే అరగంట పాటు వెయ్యికోట్లకు అధిపతి అయ్యాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే జీరో అయ్యా డు. ఈషాకింగ్ ఘటన హిం దూపురంలో జరిగింది. పట్ట ణంలోని సదాశివనగర్‌కు చెందిన ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి తోట ఆనంద్‌కు కొటాక్ మహేంద్ర బ్యాంక్‌లో 1147924495 నంబర్‌తో ఖాతా ఉంది. అయితే మంగళవారం మధ్యాహ్నం ఆయన ఫోన్‌కు ఒక మెసేజ్ వచ్చింది. తెరిచి చూడగా తన ఖాతాలో డబ్బులు జమ అయినట్లు గుర్తించాడు. తన ఖాతాలో మొదట రూ.32వేలు పైచిలుకు ఉంది. ఆ తరువాత చూసేసరికి వెయ్యికోట్లు జమ అయి నట్లు గుర్తించాడు. దీన్ని స్నేహితులకు సైతం చూపించాడు. ఈ షాక్ నుంచి తేరు కునేలోపే అరగంటలోనే తన ఖాతాలో జీరో చూపించింది. అంతేకాక మొదట తన ఖాతాలో ఉన్న రూ.32వేలకుపైగా నగదుకూడా కనిపించకుండా పోయింది. దీంతో బ్యాంక్ వద్దకు వెళ్లి ఆరాతీశాడు. వారుకూడా సరైన సమాధానం చెప్పక పోవడంతో వెంటనే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైంలో కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆనంద్ తెలిపారు. ఈ విషయం బుధవారం రాత్రి వెలుగులోకి వచ్చింది.

పెనగలూరులో పెట్రోల్ బాంబుల దాడి ప్రచారం అవాస్తవం: తిరుపతి ఎస్పీ

గ్లోబల్ వార్త – తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చాలా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. చిన్న చిన్న సంఘటనలు మినహా ఎక్కడా పెద్దగా ఏమీ లేవన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో ఉదయం పెట్రోల్ బాంబులతో దాడి జరిగిందంటూ కొన్ని వార్తలు, ప్రచారాలు వచ్చాయని.. అయితే అది పూర్తిగా అవాస్తవమన్నారు. అక్కడ ఉన్న పోస్టర్లను అంటించడం వల్ల దాన్ని పెట్రోల్ బాంబులుగా ప్రచారం చేశారని వివరించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకున్నారన్నారు. ఇద్దరి మీద కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని తెలిపారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,600 మంది పోలీసులు విధుల్లో నిమగ్నమై ఉన్నారని అన్నారు.



తొలి వన్డేలో కివీస్‌పై భారత్ ఘన విజయం

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియాకు అదిరే ఆరంభం. బలహీనంగా ఉందని విమర్శలపాలైన మన బౌలింగ్ దళమే ఆతిథ్య కివీస్ బ్యాటర్లను బెంబేలెత్తించింది. కెరీర్‌లో రెండో వన్డే ఆడిన పేసర్ అన్షుల్ కాంబోజ్ (10-2-22-2) మధ్య ఓవర్లలో పొదుపైన బౌలింగ్‌తో కట్టడి చేశాడు. అటు మరో పేసర్ అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లతో చెలరేగగా, ఆరున్నర అడుగుల పొడగరి గుర్నూర్ బ్రార్ (3/44) బౌన్సీ బంతులతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఇక ఛేజింగ్‌లో రారాజు విరాట్ కోహ్లీ (51 బంతుల్లో 13 ఫోర్లు, ఓ సిక్స్‌తో 74) సూపర్ ఇన్నింగ్స్‌తో సత్తా చాటాడు. దీంతో బుధవారం ఈడెన్ పార్క్‌లో జరిగిన తొలి వన్డేలో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 5 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్ కాస్త ఆలస్యంగా ఆరంభమైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ టిమ్ సైఫర్ట్ (38), బ్లెయిర్ టిక్నెర్ (34), గ్లెన్ ఫిలిప్స్ (30), డారిల్ మిచెల్ (28) రాణించారు. ఛేదనలో భారత్‌కు రెండుసార్లు వర్షం ఆటంక పరిచింది. దీంతో మొదట లక్ష్యాన్ని అంపైర్లు 40 ఓవర్లలో 167 పరుగులకు కుదించారు. ఆ తర్వాత మరోసారి వర్షం కురవడంతో.. ఈసారి లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 రన్స్‌కు కుదించారు. ఇక, ఈ టార్గెట్‌ను భారత్ 22.4 ఓవర్లలోనే 143/5 స్కోరుతో పూర్తి చేసి గెలిచింది. కెప్టెన్ గిల్ (37) ఫర్వాలేదనిపించాడు. డఫీకి 3 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా అన్షుల్ కాంబోజ్ నిలిచాడు.

విరాట్ జోరు: స్వల్ప ఛేదనలో భారత్ తొలి ఓవర్‌లోనే రోహిత్ (0) వికెట్ కోల్పోయింది. అయితే గిల్-విరాట్ జోడీ మాత్రం కివీస్ బౌలర్లకు అవకాశం ఇవ్వలేదు. అయితే 11వ ఓవర్‌లో గంటపాటు వర్షం కురవడంతో లక్ష్యాన్ని సవరించారు. ఆ తర్వాత ఏడు బంతుల మ్యాచ్ కాగానే, మరో అర్ధగంటపాటు వర్షం అంతరాయం ఏర్పడింది. దీంతో మ్యాచ్‌ను 32 ఓవర్లకు తగ్గించారు. అనంతరం కోహ్లీ బౌండరీలతో చెలరేగడంతో 35 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే రెండో వికెట్‌కు 113 పరుగులు జోడించాక గిల్ వెనుదిరిగాడు. ఇక 20వ ఓవర్‌లో కోహ్లీ, అక్షర్ (0)లను, 22వ ఓవర్‌లో శ్రేయాస్ అయ్యర్ (15)ను డఫీ అవుట్ చేసినా, అప్పటికే భారత్ విజయానికి ధోకాలేకపోయింది. నమన్ ధిర్ (5 నాటౌట్) ఫోర్‌తో 56 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.



అమ్మాయిల తొలి ప్రత్యర్థి మలేసియా

గ్లోబల్ వార్త – న్యూఢిల్లీ: ఓవైపు పురుషుల హాకీ చాంపియన్స్ ట్రోఫీ జరుగుతుండగా, మహిళల టోర్నీ షెడ్యూల్ కూడా వచ్చేసింది. వచ్చేనెల 19 నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా మహిళల చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. ఆతిథ్య భారత్, జపాన్, చైనా, మలేసియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా పోటీపడే ఈ టోర్నీ నవంబరు 28న ముగియనుంది. హ్యాట్రిక్ టైటిల్‌పై కన్నేసిన భారత్ తన పోరును తొలిరోజు మలేసియాతో ఆడనుంది. అదేరోజు జరిగే ఆరంభ మ్యాచ్‌లో చైనా, థాయ్‌లాండ్ తలపడతాయి. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లను 21న కొరియాతో, 22న థాయ్‌లాండ్‌తో, 24న చైనాతో, 25న జపాన్‌తో ఆడనుంది.



తన్వీ, అన్మోల్ ముందంజ

గ్లోబల్ వార్త – న్యూఢిల్లీ: భారత యువ షట్లర్లు తన్వీ శర్మ, అన్మోల్ ఖర్బ్ కొరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశారు. వెటరన్ స్టార్ హెచ్ఎస్ ప్రణయ్ మాత్రం అనూహ్యంగా తొలిరౌండ్లోనే నిష్క్రమించాడు. దక్షిణ కొరియాలోని యోసులో బుధవారం జరిగిన సింగిల్స్ మొదటి రౌండ్లో తన్వీ 21-16, 12-21, 21-17తో మనామి సుయిజు (జపాన్)పై, అన్మోల్ 21-19, 21-18తో రేచల్ చాన్ (కెనడా)పై గెలిచారు. ప్రణయ్ 15-21, 21-23తో యో తే బిన్ (దక్షిణ కొరియా) చేతిలో కంగుతిన్నాడు.



వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు సింధు

గ్లోబల్ వార్త – న్యూఢిల్లీ: మళ్లీ ఫామ్‌ను అందిపుచ్చుకొన్న ఏస్ షట్లర్ పీవీ సింధు.. 2022 తర్వాత తొలిసారి ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తోన్న 31 ఏళ్ల సింధు.. గతవారం హైలో ఓపెన్, జూలైలో జపాన్ ఓపెన్ టైటిళ్లు నెగ్గింది. అంతకుముందు ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్ చేరింది. దీంతో వరల్డ్ టూర్ ఫైనల్స్ తాజా ర్యాంకింగ్ జాబితాలో రెండు స్థానాలు ఎగబాకిన సింధు ఆరో స్థానంలో నిలిచింది. దీంతో ఆమె మెగా టోర్నీకి అర్హత సాధించినట్టు బ్యాడ్మింటన్ వరల్డ్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తెలిపింది. చైనాలోని హాంగ్‌జౌలో డిసెంబరు 9 నుంచి 13 వరకు వరల్డ్ టూర్ ఈవెంట్ జరగనుంది. ఈ టోర్నీలో టాప్-8 ర్యాంకింగ్ షట్లర్లు మాత్రమే పాల్గొంటారు. ఈ మెగా టోర్నీకి సింధు అర్హత సాధించడం ఇది ఆరోసారి కాగా, 2022లో సింధు గాయంతో తప్పుకొంది. ఇక, 2018లో సింధు ఈ టోర్నీ విజేతగా నిలిచింది.



నేటి తుది పోరులో జపాన్‌తో ఢీ ....ఆసియా చాంపియన్స్ హాకీ ట్రోఫీ

మొహాలీ: జైత్రయాత్ర కొనసాగిస్తున్న భారత హాకీ జట్టు రికార్డు స్థాయిలో ఏడోసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధ వారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 8-1తో కొరియాను చిత్తు చేసింది. శైలేంద్ర లక్రా (4వ, 13వ నిమిషం), దిల్‌ప్రీత్ సింగ్ (21వ, 25వ) రెండేసి గోల్స్ చేయగా.. కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ (9వ), సుఖ్‌జీత్ సింగ్ (21వ), అంగద్ సింగ్ (36వ), వివేక్ సాగర్ ప్రసాద్ (54వ) తలో గోల్ సాధించారు. కొరియా తర ఫున సంగ్‌జున్ హాన్ (9వ) ఏకైక గోల్ చేశాడు. గురువారం జరిగే టైటిల్ ఫైట్‌లో జపాన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమ? సలో జపాన్ షూటౌట్‌లో 5-3తో మలేసియాపై గెలిచింది.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA AND PUBLISHED FROM VIJAYAWADA
D.NO. 28-2-22, II FLOOR, SHAIK MOHIDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520002. EDITOR DONDLAVAGU BHAVYA. PH . 08562-461571 APTEL/2025/16480